నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల
వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 6 జూలై 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



కోస్గిలో గోవర్ధన్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# గోవర్ధన్‌రెడ్డికి సీఎం నివాళి

కోస్గి, జూలై 5 : కోస్గి మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి పోతిరెడ్డిపల్లికి చేరుకొని గోవర్ధన్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అతడి భార్య సావిత్రి, తల్లి యాదమ్మను రేవంత్ ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అంతకుముందు హెలీప్యాడ్ స్థలాన్ని ఎస్పీ యోగేశ్ గౌతమ్ పరిశీలించారు. సీఎం వెంట రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, బాలరాజుతోపాటు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పర్యాటక హబ్‌గా నల్లమల


నల్లమలలోని పరహాబాద్ వ్యూపాయింట్‌ను సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

- ఎకో టూరిజం అభివృద్ధిపై మేధోమథనం
- క్షేత్రస్థాయి పరిశీలనకు రెండ్రోజుల స్టడీ టూర్
- ఉమామహేశ్వరం అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు
- మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట రూరల్, జూలై 5 : నల్లమలను ప్రత్యేక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఆయన టూరిజం శాఖ ప్రత్యేక బస్సులో నల్లమలలో రెండు రోజుల స్టడీ టూర్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర ఆలయం వద్దనున్న పాపనాశనిలో స్నానా లు చేసి అమ్మవారికి కుంకుమార్చన, స్వామికి అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.50 లక్షలతో ఆలయం ముందుభాగాన్ని విస్తరించి భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎకో టూరిజం అభివృద్ధిపై ఇద్దరు మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మేధోమథనం చేయడానికి నల్లమలలో రెండ్రోజులు క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. పర్యాటక అభివృద్ధి, మౌలిక వసతుల ఏర్పాట్లు, యువతకు ఉపా ధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించనున్నారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, మంత్రు లు, ఎమ్మెల్యేల బృందానికి పూలమొక్కలు అందిం చి స్వాగతం పలుకగా.. ఆలయ చైర్మన్ సుధాకర్, ఈవో శ్రీనివాసరావు, అర్చకులు పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకుముందు కొండకింద రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షేక్ షావలీ దర్గాలో వారు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, పురావస్తుశాఖ డైరెక్టర్ భారతి హోళిఖేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఈల త్రిపాఠి, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి, ఐఎస్‌ఎఫ్ సుశాంత్ పాల్గొన్నారు.

**40లక్షల మొక్కలు టార్గెట్..**

అమ్రాబాద్, జూలై 5 : మొక్కలు నాటి వనాలను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని మంత్రులు జూపల్లి, రాజనర్సింహ అన్నారు. శుక్రవారం 75వ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మన్ననూర్ చింతలచెరువులోని రెవెన్యూ భూముల్లో విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పీసీసీఎఫ్ డోబ్రియల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**మీడియాకు నో ఎంట్రీ..**

టూరిజం హబ్‌గా మా ర్చేందుకు అవసరమైన ప్రాంతాలను పరిశీలించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు శుక్రవారం మండలంలోని పర్యాటక ప్రదేశాలకు వెళ్లారు. అయితే అటవీ, టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మీడియాకు అనుమతిలేదని సంబంధిత అధికారులు తెలిపారు. కానీ మంత్రు లు, ఎమ్మెల్యేలతోపాటు కొందరు కాంగ్రెస్ నాయకులకు మాత్రం సఫారీ వాహనాన్ని ఏర్పాటు చే యడమేంటని పలువురు చర్చించుకుంటున్నారు.

# ఘనంగా మట్టెద్దుల అమావాస్య


గద్వాల మండలం పుటాన్‌పల్లిలో ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న రైతులు

- భక్తిశ్రద్ధలతో రైతుల పూజలు

గద్వాల టౌన్, జూలై 5 : మట్టెద్దుల అమావాస్యను శుక్రవారం రైతన్నలు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆలయాల్లో పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కొందరు రైతులు మట్టితో తయారు చేసిన మట్టి ఎద్దులు, గాడ్పాటుకు పూ జలు నిర్వహించారు. సాగులో తమకు చేదోడుగా ఉంటూ కష్టంలో పాలుపంచుకుంటున్న ఎద్దులు, పశువులు చల్లగా ఉండాలని రైతులు వేడుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని ప్రార్థించారు. మట్టే రైతుకు జీవితమని, ఆ మట్టిని నమ్ముకుని బతుకు సాగిస్తాడని, అలాంటి రైతుకు ఏమిచ్చినా రుణం తీరదని పండితుడు ప్రసన్నాచారి పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను భావితరాలకు తెలియజేసేలా ఊరూరా ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**వడ్డేపల్లిలో..**

వడ్డేపల్లి, జూలై 5 : మండలవ్యాప్తంగా అన్నదాతలు శుక్రవారం మట్టెద్దుల అమావాస్యను ఘనంగా జరుపుకొన్నారు. మట్టితో తయారు చేసిన ఎద్దులను కొనుగోలు చేసి వాటికి పూజలు నిర్వహించారు. శాంతినగర్‌లో మట్టి, టేకుతో తయారుచేసిన ఎడ్లబండ్లు నడుపుతున్న రైతులు, ఎద్దుల బొమ్మ లు, నాగలి దున్నుతున్న బొమ్మలను విక్రయించారు. వ్యవసాయంలో సహకరించే ఎద్దులకు కృతజ్ఞతాభావంతో ఉండాలని సూచించే ఈ పండుగ రైతులకు ఎంతో ముఖ్యం.


గద్వాలలో మట్టి ఎద్దుకు పూజలు చేస్తున్న అర్చకులు


వడ్డేపల్లిలో ఎడ్లబండ్ల బొమ్మలు విక్రయాలు

గద్వాల జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు




# నిరుద్యోగుల నిరసన

గద్వాల, జూలై 5 : ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో నిరుద్యోగులు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. గ్రూప్–1ప్రిలిమినరీలో 1:100 క్వాలిఫై ప్రకటించాలని, గ్రూప్–2కు అదనంగా మరో 2వేల పోస్టులు, గ్రూప్–3 నోటిఫికేషన్‌కు అదనంగా 3వేల పోస్టులు పెంచి భర్తీచేయాలనే డిమాండ్‌లతో కృష్ణవేణి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య మద్దతుగా మాట్లాడారు. 25వేలతో మెగా డీఎస్సీని ప్రకటించాలని, తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారి డిమాండ్లను తీర్చాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి ఢిల్లీ చుట్టూ ఇప్పటికే 17 సార్లు చక్కర్లు కొట్టాడని విమర్శించారు. నిరుద్యోగులపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. నాడు నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వారినే అణగ దొక్కే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పంది ంచి నిరుద్యోగులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో మాధవ్, చిన్న, హరీశ్, నరసింహులు, జోయల్, రాము, వేణు, గోపాల్, బజారన్న, జయరాం, కిరణ్, మహేశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

# అడుగడుగునా.. అడ్డగింత

- టీజీపీఎస్సీ ముట్టడికి కదిలిన నిరుద్యోగులు
- బీఆర్‌ఎస్‌తోపాటు విపక్షాల మద్దతు
- ఉమ్మడి జిల్లాలో అడ్డుకున్న పోలీసులు
- ముందస్తుగానే పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- ప్రభుత్వం నిరుద్యోగుల నోరునొక్కుతుందని విద్యార్థి సంఘాల ఆగ్రహం

*'గ్రూప్ పోస్టుల సంఖ్య పెంచాలి.. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలి.. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి.. మెగా డీఎస్సీ ఇవ్వాలి.. జీవో 46 రద్దు చేయాలి.. నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి..' అన్న డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరుద్యోగుల మార్చ్‌కు వెళ్లకుండా పలువురిని నిర్బంధించారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరుద్యోగులను అడుగడుగునా పోలీసులు అడ్డుకొన్నారు. బీఆర్‌ఎస్‌తోపాటు విపక్షాలు, యువజన, విద్యార్థి సంఘాల నేతల ఇండ్లల్లో సోదాలు నిర్వహించారు. ముందస్తుగా వారిని ఖాకీలు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.*


అమరచింత పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్వీ నేతలు


అయిజ పీఎస్‌లో జాక్ నాయకులు



కొల్లాపూర్‌లో విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసి జీపులో పీఎస్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూలై 5 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో శుక్రవారం నిరుద్యోగుల మార్చ్‌కు వెళ్లకుండా సర్కారు ఉక్కుపాదం మోపింది. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసింది. హైదరాబాద్‌లో జరిగిన టీజీపీఎస్సీ ముట్టడికి బయలుదేరుతారన్న సమాచారంతో అచ్చంపేటలోని బీఆర్‌ఎస్, గిరిజన విద్యార్థి, యువజన విభాగం నాయకులను పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. అయిజ పట్ట ణంలోని నిరుద్యోగ జాక్ నాయకులను తెల్లవారు జామునే పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై ఎస్సై విజయ్ భాస్కర్ విడుదల చేశారు. అలాగే విద్యార్థి సంఘం నేత మన్యాన్ని గద్వాల టౌన్ పోలీసులు, ధరూర్‌లో ఏబీవీపీ మండల నేత సురేశ్‌ను, గట్టులో విద్యార్థి సంఘం నాయకులను, అమరచింతలో తోకలి రమేశ్‌తోపాటు బీఆర్‌ఎస్వీ నాయకులు ప్రేమ్‌కుమార్, డీసీ పురుషోత్తం, కొత్తకోటలో బీఆర్‌ఎస్ నేత జనుంపల్లి కిరణ్‌తోపాటు మక్తల్‌లో బీజేవైఎం, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. చారకొండలో బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ చండీశ్వర్, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ సలీం, బీజేపీ నేత కన్నా హైదరాబాద్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. అలాగే కొల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వారి ఇండ్లల్లో పోలీసులు సోదాలు జరిపారు. నిద్రిస్తున్న బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంకల దాస్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్‌తోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డీఎస్సీ పోస్టులను పెంచా లని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మూడు నెలలు గడువు ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలీసుల అరెస్టులతో ఇంకా నిరుద్యోగులలో విప్లవ కెరటం ఎగిసి పడుతుందే తప్పా వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. అక్రమంగా తమను అరెస్టు చేయ డంపై.. ప్రభుత్వం నిరుద్యోగులపై వివక్ష చూపడ మేనని.. తమ హక్కులను హరించడమేనని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అక్రమ అరెస్టులకు పాల్పడి నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపుతున్నదని విమర్శించారు. ప్రశ్నించే నిరుద్యోగుల నోరు నొక్కడంతో రేవంత్ సర్కారు సాధించేది ఏమీ లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

# దివ్యాంగులపై సర్కారు చిన్నచూపు

- పెంచిన పింఛన్లు అమలు చేయాలి
- వనపర్తి, పాలమూరు కలెక్టరేట్ల ఎదుట దివ్యాంగుల ఆందోళన

వనపర్తి, జూలై 5 : సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులపై చిన్నచూపు చూస్తున్నారని వికలాంగుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ ప్రభాకర్‌శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పలు పార్టీల మద్దతుతో దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తున్నా హామీలను నెరవేర్చకుండా దివ్యాంగులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం.. అన్ని ప్రభుత్వ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్, రాష్ట్ర బడ్జెట్‌లో 5 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. 6వ తేదీ నుంచి 16 వరకు అన్ని కలెక్టరేట్‌ల వద్ద దీక్షలు చేపడుతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 17 నుంచి అన్ని మండలాల్లో దీక్షలు, ధర్నాలు చేస్తామని, అవసరమైతే రోడ్డు దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు గట్టుస్వామి మాదిగ, కృష్ణయ్య, గంధం లక్ష్మయ్య, నారాయణరావు, కుషకుమార్, పోతుపల్లి రాజు, జనార్దన్, విజయ్, కృష్ణవేణి, శ్రీనివాసులు, చెన్నయ్య, రవివర్మ, కృష్ణతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.


వనపర్తి కలెక్టరేట్ ఎదుట వివిధ పార్టీల నాయకులతో కలిసి ధర్నా చేస్తున్న దివ్యాంగులు


మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేస్తున్న దివ్యాంగులు

**పెంచిన పింఛన్‌ను అమలు చేయాలి**

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5 : పెంచిన పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు శుక్రవారం మహాధర్నా చేపట్టారు. గత ప్రభుత్వం ఇచ్చిన పింఛన్‌ను పెంచి రూ.6వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమను విస్మరించిందని విమర్శించారు. ఆసరా పింఛన్‌కు ఆదాయ పరిమితిని విధించే జీవో 13ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5 : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13వేల గ్రామపంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి ప్రతి నెలా రావాల్సిన జీతం నెలల తరబడి అందడంలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరితో కార్మికుల బతుకులు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ గ్రాట్యుటీ కల్పిస్తూ జీ వో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు ఉన్నారు.



మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

# వాన హోరు.. రైతన్న జోరు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాలమూరులో 2మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ముసురు కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో పంటలకు మేలు చేకూరినట్లయ్యింది.


మహబూబ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం